లోకం తీరు

శ్రీ బలివాడ కాంతారావు

చిట్టిబాబు! గురించి ఆ పట్నంలో యెవరికి తెలీదు?

అతనికీర్తి వూరంతా వ్యాపింపజేసిన వారిలో ముఖ్యులు—ఆఫీసులో అతని క్రిందనున్న గుమాస్తాలు, బంట్రోతులు. ఇంట్లోనున్న యేడాదికి పది సార్లు మారిన పనిమనుషులు.

చిట్టిబాబు నవ్వడు—నిజమే! ఏ నాడైనా పొరపాటున ఒక చిరునగవు ఓ లిప్తపాటున కనిపించిందంటే ఆవేళ వర్షం వస్తుందని గుమాస్తాలు అనుకుంటారు. మొగుడూ పెళ్ళాలు జగడమాడుకుంటారనీ, దానికి కారకుడు మొగుడేనని వూరంతా ఈ విషయం చాలా వూహించుకున్నారు. దానికి ప్రత్యక్ష నిదర్శనాలు చాలా వున్నాయి.

ఒకనాడు చిట్టిబాబు పెళ్ళాం మీనాక్షితో సహా బజారుకు వెళ్ళాడు. రోడ్డుమీదే పెళ్ళాంమీద కస్సుమంటున్న చిట్టిబాబును యెందరో ఆగి మరీ చూసారు. బుష్‌షర్టు కున్న చిరిగినజేబు ఆమె కుట్టడం మరిచిపోయింది. చిల్లర డబ్బులు జారిపోయాయి. ఇంకోజేబులో వెయ్యలేక పోయారా అని ఆమె అన్నదని అసలు అక్కసు. 'జేబులు పరీక్ష చేసుకూర్చోడానికి నీలాగ నాకు తీరుబడేదీ? ఇంట్లో దేనికున్నావ్ — తినడానికా?' ఇంకా కోపం వచ్చేస్తోంది కాని ఆమె మౌనంతో అతగాడు వూరుకున్నాడు.

ఇంకోనాడు - ఇంట్లో—ఉదయమే. అతగాడు భార్యను వేగంగా తయారవమన్నాడు. నిన్ననే చెప్పాలని మరచిపోయాడు. ఎవరో యింట్లో పెళ్లి—వెళ్ళాలని ఆమె 'యింకా పిల్లలిద్దరూ లేవలేదు. నేనెలా రాగలను? మీరు వెళ్లిరండి' అంది.

'వస్తావా? రావా?' అన్నాడు.

'ఎలా రమ్మంటారండీ? పిల్లలకు స్నానాలు అవీ చేయించి — అమ్మాయి పదిగంటలకే ఆకలికి యేడుస్తుంది.'

'ఏం...నా మాటంటే ఖాతరు లేదా?'

'అలా అన్నానండీ?...

ఇలా మాటా మాట పెరిగి 'విడాకులు తీసుకోవాలని వుందా?' అని యెగిరాడు. మీనాక్షి కళ్ళల్లో నీరు తెచ్చుకుని 'ఇంత పోషిస్తున్నారని—ఇంత మాటలు అనండి'

'ఉద్యోగం చెయ్యలేక పోయావా?'

'అంతచదువు చదివించలేదు మావాళ్ళు'

ఇలా ముదిరినకోపం అతనిచే కేకలు వెయ్యించి పిల్లలను లేపింది, పనిమనుషులను వణికించింది. అతడు విడాకులు తీసుకోనున్నాడన్న వార్తమాత్రం బజారులో పడింది. ఆ రాత్రి తను పడగ్గదిలో పెళ్ళాన్ని బతిమాలి మళ్లీ యెప్పుడూ యింక పెద్దమాటలు ఆడనని వేసుకున్న ఒట్టువిషయం వాళ్ళిద్దరికి తప్పించి యింకెవరికీ తెలీదు.

ఎవరైనా అడుక్కోడానికివస్తే మీనాక్షి బిచ్చం వెయ్యబోతే 'వెధవ పోతులా వున్నాడు బిచ్చంవేసి వాణ్ణెందుకు పాడుచేస్తావ్' అని బిచ్చంవెయ్యకుండా చేసేవాడు. వాడు 'ఆ అమ్మ మంచిదే. బిచ్చం వెయ్యడానికొస్తే ఆ బాబు కానిచ్చాడుకాదని' చాటేవాడు. రోడ్డువార అరచుకుంటున్న గుడ్డివాడికి చీకట్లో జేబులోవున్న చిల్లరడబ్బులంతా చిట్టిబాబు వెయ్యటం యెవరు చూసారు?

ఆఫీసులో గుమాస్తాలమీద పులి. డైరీలో అంతా రాసుకుని ఆ రోజు ఉదయమే గుమాస్తాల

మీద సవారీ 'అబ్బా! ంతా కరెక్టుగా టైములో అయిపోవాలి. వాడింట్లో పెళ్లామైనా రోజూ టైముకు భోజనం పెట్టుందా? చంపుకుతింటున్నాడు. ఎప్పుడు పోతాడో?' సంవత్సరం ఆఖరులో తన క్రిందవున్నవాళ్లందరి పనిమీద మంచి రిపోర్టులు రాసిన వైనం యెందరకు తెలుసు?

అంతా చిట్టిబాబుకోపం, పెళ్లాంకు విడాకు లిస్తానని బెదిరింపులు, బిచ్చమయినా వెయ్యడానికి ఒప్పుకోని అతని పిసినారితనం, ఆఫీసులో గుమాస్తాల మీద పులిలా పురకటం, యిలాంటి అవలక్షణాల గురించి పొగరేగినట్లు చెప్పుకుంటున్న సమయంలో ఒక మంట లేచింది. అతనికి దయాదాక్షిణ్యాలు లేవని, ఉత్త కోపిష్టనీ, కట్టుకున్న పెళ్లాంకూడా సహించలేని మాటలు విసిరి ఎదుటివాళ్ల మనస్సు నొప్పిస్తాడని, నవ్వనెరగడని, హాస్యానికి, పరిహాసానికి దూరంగా వుంటాడనీ......ఇలా యెన్నో విశేషణాలతో అతని గుణగణాలు చెప్పుకుంటున్న తరుణంలో ఈ ఘోరం జరిగిపోయింది

ఉదయమే—ఆ క్రిందటి రాత్రి మొగుడూ పెళ్లాలు అన్యోన్యంగా ఒంటిగంట రాత్రివరకూ యెన్నో కబుర్లు చెప్పుకున్నారు. కొడుకూ, కూతురూ ఇద్దరూ కదలకుండా పడుకుని వీళ్లవలపు వలగ పోసుకోటానికి అవకాశం యిచ్చారు. తన కోపం పట్టింపుచేసుకోవద్దని జీవితంలో ఎలాంటి అర్ధాంగిని కాంక్షించానో అల్లాంటిదే దొరికిందనీ మళ్లీ పొర పాటునైనా ఆమె మనసు నొప్పించనని చిట్టిబాబు పెళ్లాంతో చెప్పుకున్నాడు. ఒక్కక్షణం పూల తోటలో వెన్నెల్లో విహరించారు. ఆమె అతని వక్షంపై తలపెట్టి ముద్దుపెట్టి రెండు చేతులతో అతని భుజాలను తాకుతూ 'జన్మజన్మలకు మీలాంటి భర్తే కావాలని' కోరుకుంది. ఇద్దరూ నవ్వుకున్నారు. మౌనంగా నిట్టూర్పులతో వలపుతేనియలు సృష్టించు కున్నారు. అదో స్వప్నవిహారమైంది నాడు.

అలస్యంగా లేచిందేమో—రాత్రి కట్టుకున్న నైలాన్ చీర మార్చకుండానే వంట యింట్లో కాఫీకోసం స్టౌ వెలిగించడానికి మీనాక్షి వెళ్లింది. కాఫీపొడుంకోసం తిరిగిందో లేదో గాలికి పమిట యెగిరి 'స్టౌ' మీద పడింది. చీరకు నిప్పంటు కుంది...వంట యింట్లో కేకలు, విని చిట్టిబాబు పరుగెత్తాడు కళ్ల యెదురుగానే ఆమె కాలిపోయింది. ఆసుపత్రిలో ఒక రోజంతా చావు బ్రతుకులమధ్య పెనుగులాడి ఒక్క క్షణంలో చావు తెలివి తెచ్చుకొని కన్ను మూసింది.

చిట్టిబాబు మూగపోయాడు. పిల్లలగోడు యింతా అంతా కాదు. అమ్మ యేదంటే వస్తుం దమ్మా అన్నాక యేడుపు ఆపుకోలేక పోయాడు. రెండో రోజు యింకా అమ్మా రాలేదేం అని కూతురు మారాం చేస్తోంది. చంటివాడు చనుబాలుకు తహ తహలాడి యిల్లు యెగరగొట్టున్నాడు. వచ్చేవాళ్లు విధిలేక వస్తున్నట్లుంది వాళ్ల ముఖభంగిమలు చిట్టిబాబుకు నచ్చలేదు ఒంటిగా గదిలో ఒకమూల తలుపులు లోనించి గడియవేసుకుని కూర్చున్నాడు. ఎదురుగా నిలువుటద్దం అందులోనించి తన ప్రతి బింబం యెన్నెన్నో ప్రశ్నిస్తోంది. మీనాక్షి అమాయ కత్వ, ఆమె ప్రేమ ఈ ప్రమాదానికి ముందు రాత్రి తనలో ఐక్యమై జన్మ జన్మలకు భర్తగా తనని కోరుకోవటం—ప్రేమలో సిగ్గు కలిపి విభుని మెల్లగా లతలా అల్లుకొన్న మీనాక్షి, కరుకుతనం యెరగని యిల్లాలు—తన్ను వదలి బుగ్గయిపోయింది.

ఎందుకలా జరగాలి? తనలో యేదో లోటుం దేమో? లోకం అంతా తనని చెడ్డవాడంది. తన కోపం, లోభం, తన విసుగు—

ఇలా సతమతమయ్యే రోజుల్లో ఒకనాడు వీధిలో గుసగుసలు విన్నాడు. తను వినటం పొర పాటేమో? మరునటి రోజు కిళ్లీ కొట్టు దగ్గర యిద్దరు తనను చూడకుండా తన భార్య చావు గురించి మాట్లాడుకుంటున్నారు. ఇంకో రాత్రి రైల్లో ఒక మూల కూర్చుంటే ప్రయాణీకులు తన భార్య చావు గురించే వ్యాఖ్యానించుకుంటున్నారు. ఇంకో రోజు ఆఫీసులో గుమాస్తాలు తను గదిలో లేడనుకొని వాగారు. ఇలా వ్యాఖ్యానాలు బహుశః యీ వూర్లో ప్రతి యింటిలో జరిగి వుండాలి.

ఇంటికివచ్చి కూలబడ్డాడు. పడకగది తలుపులు వేసుకొని పెళ్ళి ఫోటో యెదురుగా నిల్చొని కన్నీరు తుడుచుకోకుండా 'చెప్పు మీనాక్షి—లోకం అన్నట్లు నా బాధలు పడలేక నువ్వు ఆత్మహత్య చేసుకున్నావా?'

రెండు రోజులు యిల్లు కదల్లేదు. రాను రాను పిల్లలను చూస్తుంటే మనసు మహాసముద్రము పోతోంది. ఏడవలేదు. ఏడిస్తే ఓదార్చే వాళ్ళెవరూ లేరు. ఇంట్లో పిల్లలను చూడటానికి కష్టమయిపోయింది. నాది అని పిల్లలను చూసుకునే దగ్గర వాళ్ళెవరూ లేరు. ఉన్నవాళ్ళయినా నెల రోజులుంటారు – రెండు నెలలుంటారు వాళ్ళ సంసారాలు వదులుకుని సంవత్సరాలు వుండగలరా?

చిట్టిబాబే వీలైనంతవరకూ యింట్లోవుండి పిల్లల సంరక్షణ చెయ్యడానికి ప్రయత్నిస్తున్నాడు. తల్లిమీద బెంగతోపాటు పిల్లలకు యేవో రోగాలు. ప్రేమయిచ్చి సంరక్షణచేసి జబ్బు కుదిర్చేవాళ్ళెవరూ లేరు. ఒకనాటి రాత్రి తెగించి ఒక నిర్ణయానికి వచ్చేసాడు. తనకు పెళ్ళాంకంటె యీ పిల్లలకు తల్లికావాలి. అందుకే తన యింట్లో ఆడది వుండాలి. దగ్గరవాళ్ళే......... ఆ పిల్ల తనకు తెలుసు. నెమ్మదైనది. తన పిల్లలను జాగ్రత్తగా పెంచుతుందని ఆ పిల్ల తండ్రిని కలుసుకున్నాడు. సంశయిస్తూనే తన వుద్దేశం చెప్పాడు. అతను కళ్ళెర్రజేసి 'నాకూతురు బ్రతకటం నీకిష్టంలేదా?'... అన్నాడు.

'ఏం? అలా అంటున్నారు!'

'మొదటిపెళ్ళాం నీ పోరుపడలేక బలవంతాన నిప్పంటించుకొని చచ్చిందిగా?'......

'లేదు లేదని' అరిచాడు. 'నువ్వు లేదంటే నిజం దాగుతుందా?...' చిట్టిబాబు అతన్ని తోసివేసి బయటకువచ్చి స్కూటరు స్టార్టుచేసినప్పుడే చెయ్యి వణుకుతోంది. ఎదరగా రోడ్డు కనపడలేదు. ఇంట్లో మీనా తిరుగుతున్నట్లు ఆమెతో యేదో విన్నవించుకున్నట్లు భ్రమపడుతున్నాడు. 'చూడు మీనా...... లోకం నన్నెంత అపార్థం చేసుకుందో? నువ్వు మూడునెలలు మంచంపడితే నేను నీకన్ని సేవలూ చెయ్యలేదా? నివ్వేది కోరితే అది నే నివ్వలేదా? మనం కులాసాగా కబుర్లు చెప్పుకోలేదా? వెన్నెల్లో విహరించలేదా? జన్మజన్మలకూ నివ్వూ నేను భార్యాభర్తలుగా వుందామని అనుకోలేదా? అలాంటి నిన్ను బలవంతంగా నేను చంపానా? ఈ లోకానికి నానించి నీవు చావలేవని ఎలా తెలుస్తుంది? యెవరుచెప్తారు? ఒక్కక్షణం బ్రతికివచ్చి చెప్పు మీనా...... నీబదులు నేను చచ్చిపోతానులే......అదిగో మీనా...అదిగో...'

చిట్టిబాబు స్కూటరు వడిగా పరిగెత్తుతోంది. అదిగో మీనా......చేతుల్లో బాబుని యెత్తుకుంది. యెదరగా వస్తోంది – ఇటు ప్రక్కనుంచి లారీ...... మధ్య చిక్కిపోయి చచ్చిపోతుంది... ... ఆమె చావడానికి వీల్లేదు – కొద్దిగా యెడమకు తిప్పాడు. అంత యెత్తునుంచి స్కూటరు ధభేలుమని ముప్పయి అడుగులు క్రిందకు దొర్లిపోయింది. బిడ్డను యెత్తుకున్న ఒక స్త్రీ చావు తప్పించుకొని గట్టిగా అరచి అక్కడే కూర్చుండి పోయింది. తల పగిలిన చిట్టిబాబు యింకా ఆసుపత్రిలో మూలుగుతున్నాడు. మీనా...నాగురించి నివ్వు చావలేదని లోకానికి చాటిచెప్పవూ?......ఆ మూలుగులోని అతని మాటలు యెవ్వరికీ అర్థంకాలేదు. అతను చచ్చిపోయాక అందరూ అన్నారు. 'పెళ్ళాన్ని చంపినవాడికి యింతకంటె గొప్ప చావెలా వస్తుంది?'